ప్రజాశక్తి
బుధవారం 11 సెప్టెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



జిఒ 85కు వ్యతిరేకంగా ఆందోళన

ప్రజాశక్తి -దుంబ్రిగుడ : జిఒ 85కు వ్యతిరేకంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యులంతా దశలవారీ ఆందోళన చేపట్టనున్నట్లు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి రాంబాబు తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు ఆందోళన చేపట్టనున్నామన్నారు.

తాజా జిఒతో తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోవడంతో పాటు ఇలా అకస్మాత్తుగా జిఒలు మార్చడం వల్ల అన్యాయం జరుగుతుందన్నారు తమ వృత్తికి కూడా తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 85ను రద్దు చేయాలని రెండు నెలలుగా సంబంధిత ఉన్నత స్థాయి అధికారులకు, ఎమ్మెల్యేలకు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి జిఒ 85ను రద్దు చేయాలని కోరారు. లేకుంటే దశలవారీగా సేవలను తగ్గించుకోవడంతోపాటు ఈనెల 16నుంచి నిరవధిక దీక్షలు చేపడతామని అన్నారు.

ప్రమాదకరంగా గోదావరి, శబరి

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- నీట మునిగిన చింతూరు
- రాష్ట్ర, అంతరరాష్ట్ర రహదారుల జలమయం
- నిలిచిన రాకపోకలు
- ఆందోళనలో ముంపు ప్రాంతాల ప్రజలు

ప్రజాశక్తి-ఎటపాక

మన్యంలో కురిసిన ఎడతెరిపిలేని వర్షాలకు తోడు, ఎగువ నుండి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతుంది. సోమవారం రాత్రి 9 గంటలకు 31.5 అడుగులుగా ఉన్న గోదావరి వేగంగా పెరిగి మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు 44.20 అడుగులకు చేరగా, సాయంత్రానికి కాస్త పెరుగతూ 48 అడుగులకు చేరింది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 10,98,266 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుంది. గోదావరి వరద గరిష్టంగా ఎంత వస్తుందని అధికారులు తెలపకపోవడంతో ముంపు గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. కూనవరం భద్రాచలం ప్రధాన రహదారి పైకి మురుమూరు వద్ద వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ - మురుమూరు, నెల్లిపాక - వీరయిగూడెం, కన్నాయిగూడెం - గట్టుగూడెం గ్రామాల మధ్య వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి

వరద నీటిలో చింతూరు

చింతూరు : ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉగ్రరూపం దాల్చుతుంది. శబరి నది ప్రవాహం మంగళవారం తెల్లవారుజామునాటికి ప్రమాదస్థాయి 44 అడుగులకు చేరింది. దీంతో మండల కేంద్రంలోని లారీ యూనియన్ కార్యాలయం, వినాయకుడి గుడి, ప్రభుత్వ మద్యం దుకాణం, విఆర్ పురం రోడ్డులోని చేపల మార్కెట్ దుకాణాలు ముంపునకు గురయ్యాయి. మండలంలోని సోకిలేరు, చీకటి వాగు పొంగటంతో విఆర్ పురం, చింతూరు మండలాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. కోయగూరు వాగు పొంగడంతో ఆంధ్ర ఒడిస్సా రహదారి 326పైకి వరద నీరు చేరి రహదారి తీవ్ర ఆటంకంగా మారింది. చత్తీస్‌ఘడ్‌లోని సుకుమా వద్ద శబరి నది వరద జాతీయ రహదారిపై చేరడంతో చత్తీస్‌ఘడ్- ఆంధ్రకు పూర్తిస్థాయిలో రవాణా సౌకర్యం నిలిచిపోయింది.

జలదీక్ష చేపట్టిన శబరి బాధితులు

ఒక నెల కాలంలోనే మూడుసార్లు వరదలు ముంచెత్తడంతో శబరి ఒడ్డు సంతపాకల నిర్వాసిత ప్రజానీకం నరకం అనుభవిస్తున్నారు. పైన వర్షం కింద వరద నీటిలో పిల్ల జల్లా ముసలి ముతక అందరూ ప్రాణాలను కాపాడుకునేందుకు సామాగ్రిని దాచుకునేందుకు శబరి బ్రిడ్జిపై గుడారాలు వేసుకొని కంటిమీద కునుకు లేకుండా తీవ్ర బాధలు అనుభవించారు. మంచినీటి ప్యాకెట్లు కూడా అందించలేదని, ఏమి తిన్నారో అడిగిన నాథుడే కరువైనడని మహిళలు వాపోతున్నారు. చివరకు వారి వీధిలో వరద నీటిలో బాధితులు నినాదాలు చేస్తూ జలదీక్ష చేపట్టారు. మాకు న్యాయం చేయండి, పునరావాసం కల్పించండి, ఈ బాధలు మాకు వద్దు అంటూ నినాదాలు చేశారు.



వరద నీటిలో నిరసన తెలుపుతున్న చింతూరు శబరి ఒడ్డు వాసులు

ఆందోళనలో ముంపు గ్రామాల ప్రజలు

విఆర్.పురం : శబరి, గోదావరి ఉప్పొంగటంతో గోదావరి పరివాహక ప్రాంతాలైన వడ్డిగూడెం, శ్రీరామగిరి, చొక్కనపల్లి, చింతరేగుపల్లి, అడవి వెంకన్నగూడెం గ్రామాల్లో రోడ్లపైకి వరద చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నుండి ఎలాంటి చర్యలు తీసుకోకపోగా కనీసం పునరవాస కేంద్రాలకు రావడానికి నాటు పడవలు కూడా ఏర్పాటు చేయలేదని ప్రజలు వాపోతున్నారు. శ్రీరామగిరి గ్రామస్తులు గుట్టలపై గుడారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తక్షణమే నాటు పడవలు ఏర్పాటు చేసి పునరావాస కేంద్రాలకు తరలించాలని, నిత్యవసర సరుకులు కిరోసిన్, బియ్యం అందించాలని వారు కోరుతున్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ప్రచారం

గోదావరి, శబరి వరద ఉధృతి పెరుగుతున్న కారణంగా వద్దుగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని వడ్డిగూడెం గ్రామపంచాయతీ సెక్రెటరీ స్వరూప రెడ్డి, సర్పంచ్ నరసమ్మ ఆధ్వర్యాన మైక్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. వడ్డిగూడెం, ధర్మతాళగూడెం, వడ్డిగూడెం కాలనీ, విఆర్ పురం గ్రామాలు మునిగే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. తక్షణమే గృహాలు ఖాళీ చేసి రేఖపల్లి పునరవాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. ప్రజలు నీళ్లలో నుండి నడిచి వెళ్లవొద్దని, పడవలు ఏర్పాటు చేశామని చెప్పారు.



విఆర్.పురం మండలంలోని శ్రీరామగిరిని చుట్టేసిన వరదనీరు

మండలానికి రాక పోకలు బంద్

కూనవరం : మళ్ళీ గోదావరి వరద ఉధృతి పెరిగడంతో మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు బందయ్యాయి. మురుమూరు వద్ద ప్రధాన రహదారిపైకి నీరు చేరడంతో భద్రాచలానికి మండలానికి రాకపోకలు నిలిచి పోయాయి. రాత్రికి గోదావరి వరద 50 అడుగులు దాటుతుందని తెలియడంతో ఉదయభాస్కర్ కాలనీ వాసులు పునరావాస కేంద్రాలకు చేరుకుంటున్నారు. రెండు నెలల వ్యవధిలో ఇళ్ల నుండి పునరావాస కేంద్రాలకు పరుగులు పెట్టడంతోనే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొండాయిగూడెం, కరకగూడెం గ్రామాల్లో వరదల వల్ల వరి నాట్లు ఇప్పటికే మునిగి రోజులు గడుస్తున్నాయని, పంట దెబ్బతినే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

ముంపు గ్రామాల్లో ఎంపిపి, సిపిఎం నేతల పర్యటన

విఆర్.పురం : మండలంలోని ముంపునకు గురైన రామవరం, అడవి వెంకన్న గూడెం గ్రామాల్లో ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు పడవలపై ప్రయాణించి పర్యటించారు. వరద బాధ్యతలు తో మాట్లాడి వాళ్ళ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్ కారం బుచ్చమ్మ, సిపిఎం నాయకులు, తహశీల్దారు సుబ్బారావు చేతుల మీదుగా కందిపప్పు, మంచి నూనె ప్యాకెట్ పంపిణీ చేశారు. రామవరంలో దోమ తెరలు అందించారు. వర్షాల వల్ల పనులు లేక సరైన ఆహారం దొరకక నానా ఇబ్బందులు పడుతున్నారని, వారికి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ఎంపిపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు కారం సుందరయ్య, వడ్లది.రమేష్, కారం సత్యం, పులి బుజ్జి, ప్రకాష్‌రావు, తాతబాబు రెడ్డి, ఆర్ఐ రామకృష్ణ, విఆర్ఓ హేమావతి, రామవరం గ్రామ సెక్రెటరీ తాతారావు, సచివాలయం సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



పడవలో వెళ్తున్న ఎంపిపి లక్ష్మి, సిపిఎం నాయకులు



వరద ఉధృతికి కొట్టుకుపోయిన జికె.వీధి మండలం గంగవరం వంతెన

భారీ వర్షాలకు తీవ్ర నష్టం

- కొట్టుకుపోయిన రహదారులు, వంతెనలు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- ధ్వంసమైన ఇళ్లు - దెబ్బతిన్న పంటలు

ప్రజాశక్తి-సీలేరు : తుఫాను బీభత్సానికి జికె.వీధి మండలంలో తీవ్ర నష్టం సంభవించింది. భారీ వర్షాలకు మండలం పరిధిలోని 16 పంచాయతీల్లో రహదారులు, వంతెనలు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. దీంతో పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. గుమ్మిరేవులు, ఏ.దారకొండ గాలికొండ తదితర పంచాయతీ పరిధి గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో మంగవారం కూడా రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. సమాచార వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆయా పంచాయతీల పరిధిలో పలుచోట్ల విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో గిరిజన గ్రామాలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. మరో వైపు వర్షపునీటి ప్రవాహానికి మండలంలో వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. దారకొండ పంచాయతీ ములసల వీధి- దార్లగొంది మధ్యగల రహదారి వర్షాలకు గండ్లుపడి పూర్తిగా కొట్టుకపోయింది. రహదారిపై మట్టి మేట్లు వేశాయి. రాళ్లు, బండలు దొర్లుకొచ్చి కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. దీంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. దారకొండ పంచాయతీ గంగవరం గ్రామ రహదారి, వంతెన రెండూ కొట్టుకుపోయాయి. దీంతో ఆరు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో అత్యవసర సమయాల్లో ఆయా గ్రామాలకు అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రజలకు వైద్య సేవలు అందించడానికి వైద్యాధికారి ఆయా గ్రామాలకు వెళ్లాలన్న కష్టతరంగా మారింది. గిరిజనులు తమ గ్రామంలోనే బిక్కిబిక్కుమంటున్నారు. కొట్టుకుపోయిన వంతెనలు, రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ధ్వంసమైన ఇళ్లు

భారీ వర్షాలకు గుమ్మిరేవుల పంచాయతీ పరిధి మాదిగ మల్లు గ్రామానికి చెందిన ధనుంజయ, పడాల్ మంజులత ఇల్లు పూర్తిగా ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయింది. ఇంట్లోని సామాగ్రి తుడిచిపెట్టుకుపోయాయి. కట్టు బట్టలతో భార్యాభర్తలు మిగిలారు. ఇదే పంచాయతీ పరిధి అన్నవరం గ్రామానికి చెందిన కిముడు మత్స్యరాజు, కిలో తన్ని ఇళ్లుపూర్తిగా ధ్వంసమయ్యాయి. బట్టలు, ఆహార పదార్థాలు తడిచిపోయి ఎందుకు పనికిరాని పరిస్థితి నెలకొంది. తల దాచుకోవడానికి గూడు లేక, కట్టుకోవడానికి బట్టలు లేక, తినేందుకు తిండి లేక ఆర్తనాదాలు చేస్తూ తమని ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని మొరపెట్టు కుంటున్నారు. ప్రభుత్వం తమకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు.



ఇల్లు కొట్టుకుపోయిన ప్రాంతాన్ని చూపుతున్న బాధితులు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో, ర్యాలీలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, సొంత గనులు కేటాయించి విశాఖ స్టీల్‌ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా సిఐటియు కమిటీ ఆధ్వర్యంలో అరకులోయ మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొర్ర మగ్గన్న మాట్లాడుతూ.కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మోడీ నాయకత్వాన దొడ్డిదారిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలని తీవ్రమైన కుట్ర చేస్తున్నారని అన్నారు.రూ.9వేల కోట్ల పెట్టుబడికి రూ.58 వేల కోట్ల డివిడెండ్ చెల్లించిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు కట్టపెట్టాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమని విమర్శించారు. ఇందులో భాగంగానే బ్లాస్ట్ ఫర్నేస్‌లు రెండింటిని ఉద్దేశపూర్వకంగా మూసివేసారని, 75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం నుండి 30 లక్షల టన్నులకు స్టీల్ ఉత్పత్తి పడిపోనుందని ఆవేదన వెలిబుచ్చారు. . దీంతో గత ఏడాది రూ.10వేల కోట్లు నష్టం రాగా ఈ ఏడాది రూ.15 వేల కోట్లు నష్టం.అనివార్యంగా రానుందని, తద్వారా నష్టాల సాకుతో విశాఖ ఉక్కును ప్రయివేటుకు కట్టబెట్టాలని బీజేపీ, మోడీ ప్రభుత్వం చూడడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలోని కూటమి ఎంపీల బలంతో కేంద్ర ప్రభుత్వం మనుగడ అధారపడి ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడిచేసి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకునేలా కూటమి నాయకులు, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా సర్వనాశనం చేసే విధంగా బిజెపి విధానాలు సాగుతున్నాయన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి, ప్రయివేటీకరణ నిలుపుదల చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించు కోవాలన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో, 64 ఎంపీల రాజీనామాలతో, నిర్వాసిత రైతుల త్యాగాలతో ఇచ్చిన 32 వేల ఎకరాల భూమిలో నిర్మించుకున్న ఆంధ్రుల హక్కు, విశాఖ ఉక్కును వదులుకోవడానికి రాష్ట్రాల్లో ప్రజలు సిద్ధంగా లేరని, అవసరమైతే కార్మిక కర్షకులతోపాటు అన్నివర్గాల ప్రజలు మరో పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు, ఐటిడిఎ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దాడి రాజు, జిసిసి సబ్బులు పరిశ్రమ కార్మిక యూనియన్ నాయకులు సింహాద్రి, సింహాచలం, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు హరి, శ్రీను, ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి బుజ్జిబాబు, కె బుజ్జిబాబు, సునీల్ పాల్గొన్నారు.



అరకులోయలో సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో

హుకుంపేట: విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు మండలకేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. యూనియన్ మండల కార్యదర్శి టి అప్పలకొండ పడాల్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణకు ముఖ్యమంత్రి, చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నాయకురాలు ఎస్ హైమావతి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణారావు, ఆనంద్, బొంజుబాబు వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



హుకుంపేటలో నిరసన వ్యక్తంచేస్తున్న సిఐటియు నేతలు

బాధితులందరినీ ఆదుకుంటాం

- మన్యంలో గిరిజన మంత్రి సంధ్యారాణి సుడిగాలి పర్యటన
- చట్రాపల్లి మృతురాలి కుటుంబానికి రూ.ఐదు లక్షల పరిహారం
- యుద్ధ ప్రాతిపదికన రహదారుల పునరుద్ధరణ
- అధికారులతో సమీక్ష, తక్షణ చర్యలకు ఆదేశం

ప్రజాశక్తి- చింతపల్లి / పాడేరు/ సీలేరు: వర్షాలు, వరదల బాధిత అన్ని కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామనిరాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందని, జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న రహదారులను యుద్ధప్రాతిపదికన తాత్కాలికంగా పునరుద్ధరణ చర్యలు చేపడతామన్నారు.

తుఫాన్ వర్షాల ప్రభావంతో అతలాకుతలమైన అల్లూరి జిల్లా మన్య ప్రాంతంలోని చింతపల్లి, జికె.వీధి మండలాలలో రాష్ట్రమంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా లంబసింగిలోని టూరిజం శాఖకు చెందిన హరిత రిసార్ట్స్‌కు చేరుకున్న ఆమె, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పి ఆమిత్ బర్ధర్, ఐటిడిఎ పిఒ వి. అభిషేక్, ఎఎస్పి ధీరజ్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం పెద బరడ పంచాయతీ మడిగుంట వద్ద దెబ్బతిన్న అప్రోచ్ రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా అదే పంచాయతీ తెరపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో తెల్లరాయి క్వారీ వలన పడుతున్న ఇబ్బందులను వినతి పూర్వకంగా తెలియపరచడంతో, ఆ క్వారీ అనుమతులపై విచారణ జరపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జాతీయ రహదారి విస్తరణ కారణంగా కోల్పోయిన పంట పొలాలకు పూర్తిస్థాయి నష్టపరిహారం అందలేదని చిన్నగెడ్డ రైతులు మంత్రి దృష్టికి తేగా, పంట పొలాలను పరిశీలించారు. అనంతరం జీకే విధి మండలం ఇసుకల రేవు వంతెనను, కొట్టుకు పోయిన అప్రోచ్ రహదారిని పరిశీలిం చారు. ఇదే మండలంలో సంపంగి గొంది గ్రామ సమీపంలో అప్రోచ్ రహదారి కొట్టుకు పోయి, కొండ చరియలు చట్రపల్లి గ్రామంపై పడడంతో గ్రామానికి చెందిన గిరిజన యువతి కుమారి మృతి చెందడంతో పాటు పలువురు గాయాల పాలైన విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఈ ప్రాంత పర్యటనకు వచ్చి, చట్రాపల్లి మృతురాలి కుటుంబానికి ఐదు లక్షల నష్టపరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. అప్రోచ్ రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని ఆదేశించారు. చింతపల్లి సీలేరు ప్రధాన రహదారిని యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాలు చేపడతామన్నారు. ఆరు వేల ఎకరాలలో పంటలు నష్టపోయాయని, నష్టపోయిన ప్రతి గిరిజన రైతుకి పరిహారం చెల్లిస్తామని మంత్రి వెల్లడించారు. అదేవిధంగా నాలుగు పశువులు, 70 మేకలు, 60 కోళ్ళు మృతి చెందాయని, వారికి కూడా నష్టపరిహారం అందిస్తామన్నారు. చిన్న గడ్డ గ్రామంలో వర్షాలకు కొట్టుకుపోయిన పంట పొలాలను ఆమె సందర్శించారు. అనంతరం సీలేరు వెళ్లే ప్రధాన రహదారి సంపంగి గొంది వరకు పర్యటించారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా పూర్తి అధ్వానంగా తయారైన అంతరాష్ట్ర రహదారి నిర్మాణాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి కేవలం నాలుగు ఐదు రోజులలోనే నిధులు మంజూరు చేయిస్తాననిహామీ ఇచ్చారు. వర్షాలతో పంటలు కోల్పోయిన గిరిజన రైతులకు పంట నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, గిడ్డి ఈశ్వరి, జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు బొర్ర నాగరాజు, కిల్లు రమేష్ నాయుడు, విజయరాణి, చల్లంగి లక్ష్మణరావు, జ్ఞానేశ్వరి,లంబసింగి, గొంది పాకల సర్పంచ్‌లు కొర్రా శాంతి కుమారి, సాగిన వరలక్ష్మి, ఐటిడిఎ ఎపిఒలు ఎం. వెంకటేశ్వర రావు, బిఎస్. ప్రభాకర్‌రావు, గిరిజన సంక్షేమ ఇఇ డివిఆర్ఎం రాజు, డిడి కొండల రావు, జిల్లా వ్యవసాయ ఉద్యాన అధికారులు ఎస్‌బిఎస్. నంద్, రమేష్‌కుమార్ రావు, హౌసింగ్ ఇఇ బి. బాబు, కాఫీ ఎడి అశోక్, స్థానిక తహశీల్దార్ రామకష్ణ, ఎంపిడిఒ ఆశాజ్యోతి, ఐసిడిఎస్ సిడిపిఒ రమణి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కె.జాహ్నవి, జిసిసి డిఎం దేవరాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మన్యం పర్యటనలో అధికారులతో మంత్రి సంధ్యారాణి

చట్రాపల్లి మృతురాలి కుటుంబానికి రూ.25లక్షల పరిహారమివ్వాలి

- క్షతగాత్రులకు రూ. 5 లక్షల పరిహారం, మెరుగైన వైద్యం అందించాలి
- సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు: తుపాన్ కారణంగా కొండచరియ విరిగిపడి మృతి చెందిన కొర్ర కుమారి కుటుంబానికి రూ.25లక్షల నష్టపరిహారం ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తుపాన్ తీవ్రతరం కావడంతో కొండ వాలు గ్రామమైన చట్రాపల్లిలో కొండ చరియ విరిగిపడి తీవ్ర విషాదం నిండిందన్నారు. ఈ ఘటనలో కొర్ర కుమారి అనే మహిళ మృతి చెందడం విచారకరమన్నారు.

మృతురాలి కుటుంబానికి రూ.25లక్షలు, గాయపడిన 8 మందికి రూ.5 లక్షల రూపాయలు చొప్పున ఆర్థిక సహకారాన్ని అందించాలని, చట్రాపల్లి గ్రామాన్ని మోడల్ కాలనీగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు తుపాన్ ప్రభావం వల్ల ధ్వంసమైన సీలేరు రహదారి మరమ్మతుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, 48 గంటల దాటుతున్నా, నేటికీ రహదారులు అనుసంధానం కావడం లేదన్నారు. కనీసం బాధితులకు మెరుగైన చికిత్స అందించడానికి కూడా ఆటంకంగా ఉందని, మైదాన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయ కార్యక్రమాలు చేపట్టే ప్రభుత్వం, ఏజెన్సీ ప్రాంతాల్లో నత్తనడకన పనులు చేస్తుండడంపై ధ్వజమెత్తారు.

జితేంద్ర చౌదరిపై విహెచ్‌పి దాడికి ఖండన

ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ, హక్కులపై జాతీయ స్థాయిలో ఆదివాసీ ప్రజలను చైతన్యపరుస్తున్న ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్, రాష్ట్ర శాసన సభ ప్రధాన పక్ష నేత జితేంద్ర చౌదరిపై విశ్వ హిందు పరిషత్ భౌతిక దాడిని సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స తీవ్రంగా ఖండించారు. త్రిపుర రాష్ట్రంలో అత్యధిక మంది ఆదివాసీలు జీవిస్తున్నారని, దేశంలో ఆదివాసీ కోక్ బర్ తెగకు లిపి కనిపెట్టి రాష్ట్రంలో రెండోవ అధికార భాషగా అభివృద్ధి చేసిన వామపక్ష ప్రభుత్వానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పని చేసిన, ప్రస్తుత శాసన సభ ప్రధాన పక్ష నాయకుడిగా ఉన్న జితేంద్ర చౌదరిపై బిజె.పి రాష్ట్ర మంత్రీ అండతో విశ్వ హిందు పరిషత్ దాడి చేసి మతం రంగు పుయ్యడానికి కుట్ర చేస్తుందని చెప్పారు.దాడి చేయడం ప్రజాస్వామ్యంలో నీచమైన చర్యని అన్నారు. వామపక్ష ప్రభుత్వం స్థానిక ఆదివాసీలకు స్వయం ప్రతిపత్తి కౌన్సిల్ ద్వారా కల్పించిన అధికారాన్ని కాలరాస్తున్న బిజె.పి ప్రభుత్వాన్పై పోరాటం చేస్తూ, ఆదివాసీలకు అండగా నిలబడిన జితేంద్రచౌదరిపై దాడి దారుణం అన్నారు.

వర్షాలతో కోతకు గురైన మెటల్ రోడ్డు

రాకపోకలకు ఇబ్బంది పడుతున్న పెదపాడు పివిటిజి గిరిజనులు


కోతకు గురైన మెటల్ రోడ్డును పరిశీలిస్తున్న గిరిజన నేతలు

ప్రజాశక్తి - డుంబ్రిగుడ: ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోతంగి పంచాయతీ పివిటిజి గ్రామం పెదపాడులో గత ఏడాది క్రితం నిర్మించిన మెటల్ రోడ్డు భారీవర్షాలతో కోతకు గురైంది. చాపరాయి గెడ్డ నుంచి పెదపాడు వరకు గతేడాది మెటల్ రోడ్డును లక్షలాది రూపాయల నిధులతో పనులు చేపట్టారు. నిర్మించి ఏడాది కాకముందే మెటల్ రోడ్డు వర్షాలతో కొట్టుకుపోవడంతో గిరిజనులకు రవాణా కష్టాలు తప్పని పరిస్థితి ఏర్పడింది.

రోడ్డును పరిశీలించిన ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

వర్షాలతో కోతకు గురైన పెదపాడు గ్రావెల్ రోడ్డును ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నిర్మించి ఏడాది కాకముందే రోడ్డు కొట్టుకుపోవడంతో గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటించకుండా నిర్మాణం జరగడంతోనే రోడ్డు కొట్టుకుపోయిందని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లోపం, రోడ్డు పూర్తికాకుండానే కాంట్రాక్టర్‌కు బిల్లులను చెల్లింపులు చేసారని ఆరోపించారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, నాసిరకంగా రోడ్డును నిర్మించిన కాంట్రాక్టర్‌పైన, అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కోతకు గురైన రోడ్డును పూర్తి చేసి రవాణా సౌకర్యం కల్పించాలని, లేనిపక్షంలో మండల పరిషత్ కార్యాలయంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీజీఎస్ నాయకులు పి అను, భాస్కరరావు,రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.


నోడల్ అధికారి చిన్నారావుకు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -హుకుంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నోడల్ ఆఫీసర్ చిన్నారావు అన్నారు. మంగళవారం మండలంలోని గత్తుం పంచాయతీలో పిఎం జన్‌మన్ గ్రామసభ నిర్వహించారు. పివిటిజిలకు జన్‌మన్‌లో అమలు కాబోయే పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో సిసి, తారు రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు ఇతర మౌలిక సదుపాయాలతోపాటు అభివృద్ధి పథకాలను అందిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అంగన్వాడీ కేంద్రం లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరాన ఉన్న కేంద్రం నుంచి కాలిబాటలో సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోందని, గుత్తులో మినీ అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని మహిళలు, గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని నోడల్ ఆఫీసర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాడి పోతురాజు, విఆర్‌ఒ సుబారావు, సెక్రటరీ అప్పన్న డిజిటల్ అసిస్టెంట్ రమేష్, గ్రామస్తులు వంతల లక్ష్మి సంగీత,పాంగి రాధమ్మ, వంతల కుసుమ, వంతల కొండబాబు వంతల సుందరరావు, గెమ్మెలి మహేష్, పాంగి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో కూలిన ఇంటిగోడ

ఆదుకోవాలి : ఆదివాసీ గిరిజన సంఘం


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు


డుంబ్రిగుడ మండల కేంద్రంలో కూలిన ఇల్లు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని పెదలబుడు పంచాయితీ గంజాయిగూడ గ్రామంలో కొర్రా నాగేశ్వరరావు ఇల్లు గోడ కూలిపోయి కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్, మండల నాయకులు తాంగుల హరి,కె మగ్గన్న అన్నారు.మంగళవారం గంజాయిగూడ గ్రామంలో పర్యటించి బాధితులకు పరామర్శించి కూలిపోయిన ఇల్లును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు గంజాయిగూడ గ్రామానికీ చెందిన కొర్రా నాగేశ్వరరావు భార్య బిడ్డలు ఏడుగురు కుటుంబ సభ్యులతో చిన్న ఇంటిలోనే నివసిస్తూ ఉండేవారని, ఇల్లు కూలిపోవడంతో వారికి నిలువనీడ లేని పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని, కొత్త ఇల్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్యటనలో గ్రామ పెద్దలు మధు,జానీ,దావీదు బాధితురాలు సీతమ్మ,కుమారి తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి గోడ

డుంబ్రిగుడ: కురుస్తున్న వర్షాల ప్రభావంతో ఆస్తి, పంట నష్టాలతో గిరిజనులు ఇక్కట్లకు గురవుతున్నారు. మండల కేంద్రం డుంబ్రిగుడలో సోమవారం రాత్రి కురిసిన వర్షంతో కమ్మిడి కొండలరావు అనే గిరిజనుడి పెంకుటింటి గోడ కూలిపోయింది సామగ్రిలు ధ్వంసమయ్యాయి.. కుటుంబీకులంతా కలిసి నిద్రిస్తుండగా గోడ కూలిపోయింది. అయితే వేరేవైపు పడడంతో ప్రమాదం నుంచి సురక్షితంగా బాధిత కుటుంబీకులు బయట పడ్డారు.

చింతపల్లి : తుఫాన్ ప్రభావంతో కూలిన ఇళ్లకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని తాజంగి పంచాయితీకి చెందిన చేరువీధి గ్రామంలోని పాంగి సీతారాం, జానకి దంపతులు నివాసం ఉంటున్న ఇల్లు ప్రధాన గోడ కూలిపోయిందన్న విషయం తెలుసుకున్న ఆయన అక్కడికి వెళ్లి, పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సమిరెడ్డి చంద్రమ్మ నివాసం ఉంటున్న ఇల్లు గోడ కూడా వర్షాలతో పునాదులు బీటలు వారడంతో ఎప్పుడు పడిపోతుందోనన్న భయాందోళనలతో గడుపుతున్నారని తెలుసుకుని వారిని పరామర్శించారు. వర్షాలతో కూలిన ఇళ్లకు, నష్టపోయిన ఇళ్లకు ప్రభుత్వపరంగా పరిహారమిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే అధికారులతో సర్వే చేయించి, బాధితులను ఆదుకోవాలని కోరారు.


చింతపల్లిలో ఇళ్లను పరిశీలిస్తున్న పాంగి ధనుంజయ్

వేతన బకాయి చెల్లించాలని ధర్నా


ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులు

ప్రజాశక్తి- చింతపల్లి : బకాయి పడ్డ రెండు నెలల వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం చింతపల్లి ఏరియా ఆసుపత్రి ఎదుట మధ్యాహ్న భోజన విరామసమయంలో స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు, బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ,స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులకు ఇచ్చే చాలీచాలని జీతాలను నెలల తరబడి ఇవ్వకుంటేఎలా బతుకుతారని నిలదీశారు. ఒకే పని చేస్తున్నప్పటికీ, వేతనాల్లో వ్యత్యాసం ఉంటోంద పాడేరు అరకులో పనిచేస్తున్న స్వీపర్లకు రూ.11,200, చింతపల్లి, ముంచంగిపుట్టులో పనిచేస్తున్న సీపర్లకు రూ.10,200 వేతనం చెల్లిస్తున్నారని, ఇందులో సెక్యూరిటీ గార్డులకు రూ.8,300 ఇస్తున్నారన్నారు. ఈ అరకొర వేతనాన్ని కూడా సరిగా ఇవ్వడం లేదని, జులై, ఆగస్టు రెండు నెలల వేతన బకాయి ఉందని మండిపడ్డారు, పిఎఫ్ సమస్యలు కూడా పరిష్కరించాలన్నారు స్వీపర్ల సంఘం సూపర్వైజర్ మంగవేణి, వి సాయి లక్ష్మి, కె.ధారామణి, సెక్యూరిటీ గార్డుల సూపర్వైజర్‌ఎస్ లక్ష్మణరావు, సిహెచ్ బొంజి బాబు, కె.మధు, కె.అర్జున్ పాల్గొన్నారు.

తడిసిన ఇళ్లలో నివాసమొద్దు!

ప్రజాశక్తి - చింతపల్లి : అల్పపీడన ప్రభావంతో మన్య ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలో గృహాలు దెబ్బతిని గోడలు కూలిపోవడంతో పలువురు గాయాల పాలయ్యారని ఆ పంచాయతీ సర్పంచ్ గెమ్మెల లలిత అన్నారు. మంగళవారం బాధిత కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శని, ఆదివారాలలో విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా సత్యవరం, బయలు కించంగి మెట్ట వీధి, చెదలపాడు, ఈదుల బయలు, చవటపాడు, మరికొన్ని గ్రామాలలో ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న ఇళ్ల వల్ల ఇప్పటికే కొందరు గాయపడ్డారన్నారు. తడిసి, ప్రమాదభరితంగా ఉన్న ఇళ్లల్లో నివాసముండొద్దని సూచించారు కార్యక్రమంలో సింహాచలం ఉన్నారు.

పశు వ్యాధుల పట్ల అప్రమత్తత

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మూగ జీవులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, పాడిరైతులు అప్రమత్తంగా పశు వైద్యాధికారులు డాక్టర్ సాగరి గణేశ్వరరావు, బి, సందీప్ అన్నారు, మంగళవారం అనంతగిరి, కాశీపట్నంలలో పశువైద్య శాఖ, అరకు మండలం సుంకరమెట్ట పశు వైద్యశాఖ అధికారి చిన్నయ్య అనంతగిరిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మేకలు, గొర్రెలతోపాటు పశువుల ఆరోగ్యంపై స్థానికులను, క్షేత్ర స్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పశువులు అస్వస్థతకు గురైన వెంటనే తగు వైద్యసేవలు అందించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న సమయంలో మూగజీవులను విచ్చలవిడిగా వదిలిపెట్టడం సరికాద పాకలలో ఉంచి అవసరమైన మేతను అందించి సంరక్షించాలని సూచించారు. లేకుండా వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువగా ఉందని హెచ్చరించారు. కాశీపట్నం పంచాయతీ బంగారంపేట గ్రామంలో వ్యాధులతో ఉన్న పశువులకు మందులు అందించారు.

గరుడపల్లిలో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని తీగలవలస పంచాయతీ గరుడపల్లి గ్రామంలో మంగళవారం హుకుంపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 40మంది రోగులు వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మోహన్ రెడ్డి సూచించారు. వర్షాలు సీజన్ కావడంతో రోగాలు బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలతో ఆసుపత్రులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నందు గర్భిణులు డెలివరీ తేదీకి ఐదారు రోజులు ముందుగానే ఆసుపత్రిలో చేరాలని సూచించారు రోగాలు బారిన పడకుండా కాచి చల్లార్చిన నీరు త్రాగాలని, వేడి ఆహారం భుజించాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హుకుంపేట హెచ్‌ఎస్‌లు సాంబశివరావు, ఆశ, ఎంఎల్‌హెచ్‌టి, ఎఎన్‌ఎంలు నాగమణి, భవాని, ఆశ వర్కర్స్ పి అప్పయమ్మ, గ్రామస్తులు కె.కామరాజు రమేష్ సోమన్న బొంజన్న అప్పన్న పాల్గొన్నారు.

సిఐని కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన హిమగిరిని స్థానిక మండల టిడిపి నాయకులు, మాజీ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ బి.కొములు నాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఐని దుశ్శాలువాతో సన్మానించారు. గిరిజన సమస్యల తక్షణ పరిష్కారానికై చర్యలు తీసుకోవాలని కొమ్ములు నాయుడు కోరారు.

చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాల్లో పాఠశాలలకు నేడు సెలవు

ప్రజాశక్తి పాడేరు:- అల్లూరి జిల్లాలోని వర్షాల తీవ్రత అధికంగా ఉన్న చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాలలో మాత్రమే బుధవారం పాఠశాలలకు జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్‌కుమార్ సెలవు ప్రకటించారు. చింతూరు, విఆర్‌పురం, కూనవరం, ఎటపాక మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు విధిగా సెలవు పాటించాలని సూచించారు.


పిల్లిగెడ్డ వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్న అధికారులు

జోరుగా పునరుద్ధరణ పనులు

ప్రజాశక్తి-సీలేరు : సీలేరు నుంచి లంకపాకల వరకు ప్రధాన రహదారిలో కొండచరియలు విరిగిపడడం, భారీ వృక్షాలు పడిపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయి. స్పందించిన అధికారులు రాకపోకలు కొనసాగించడానికి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. ఆర్ అండ్ బి అధికారులు గుత్తేదారులతో సోమవారం నుంచి రెండు జెసిబిలు సహాయంతో రహదారిపై పేరుకుపోయిన చెట్లు మట్టి దెబ్బలు తొలగించే పనులు కొనసాగిస్తున్నారు. మరోపక్క వై.రామవరం మండలం బచ్చులూరు సమీపంలో వలస గెడ్డ వంతెన కోతకు గురికావడంతో భద్రాచలం వయా సీలేరు మీదగా విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి వయా మోతుగూడెం మీదగా సీలేరు వచ్చే బస్ సర్వీసుల రాకపోకలు ఆగిపోయాయి. దీంతో ప్రయాణికులు ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు గుత్తిదారుడు కరక రమణ వలస గెడ్డ వంతెనకు మంగళవారం మధ్యాహ్నం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వంతెన పైనున్న భారీ వృక్షాలు, చెట్లు మోడ్లు తొలగించి వంతెనకు ఇరువైపుల ఇసుక బస్తాలు, మట్టి ఫిల్లింగ్ చేసి కార్లు బైకులు వచ్చే విధంగా చర్యలు చేపట్టారు.

చట్రాపల్లి బాధితులకు సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో పునరావాసం

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి కొండ చరియలు విరిగిపడి గ్రామం మొత్తం ధ్వంసమైన నేపథ్యంలో ఆ గ్రామానికి చెందిన 120 మందికి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో పునరావాసం కల్పించారు. ఆశ్రమ పాఠశాలలో భోజనం, వసతి సౌకర్యాలు కల్పించారు. మృత్యువాత గురైన కొర్ర కుమారి కుటుంబ సభ్యులకు మాత్రమే వారి గ్రామంలో కార్యక్రమాల నిమిత్తం ఉండడానికి అనుమతిచ్చారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి గ్రామంలో మంగళవారం జల్లారపు కొండబాబు సహజ మరణం చెందగా, ఆయన అంత్యక్రియలకు జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్టు రూ.5000 ఆర్థిక సహాయం అందించింది. వికలాంగుడై కొండబాబుకు అంత్యక్రియలు నిర్వహించే ఆర్థిక స్థోమత ఆ కుటుంబానికి లేకపోవడంతో విషయం తెలుసుకున్న జెకెసి ట్రస్టు సభ్యులు ఆ కుటుంబాన్ని పరామర్శించి, ట్రస్ట్ సభ్యుల ద్వారా రూ.5000 కొండబాబు మనవరాలు గడ్డం నాగలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ సభ్యులు సర్ఫరాజ్, ముత్యాల సిద్ధు, పెట్ట ముత్యాలరావు, అప్పన్న ,మల్లికార్జునరావు, యండి. రహీం, రేవు సింహాచలం, రాంబాబు, గ్రామ ప్రజలు జల్లారపు శివాజీ, వెంకట నరసమ్మ పాల్గొన్నారు.

నూతన సిఐని కలిసిన కూటమి నాయకులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సిహెచ్.గోపాలకృష్ణను మంగళవారం మారేడుమిల్లి మండల టిడిపి కూటమి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసిసారు. ఈ సందర్భంగా సిఐని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గురుకు శేషుకుమార్, మాజీ అధ్యక్షుడు బిశెట్టి అప్పాజీ, ఉపాధ్యక్షులు దూడ సువర్ణ కుమార్, కర్రి సన్యాసి రెడ్డి, మండల కో ఆర్డినేటర్ పాము రాంబాబు, ఎంపీటీసీ కోరగాని సువర్ణరాజు, జనసేన మండల అధ్యక్షులు మళ్ళా దుర్గా ప్రసాద్, యూత్ అధ్యక్షుడు భీశెట్టి సత్య, పి.రాము, డి.రత్నకర్, కె.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జలాశయాలకు తగ్గిన వరద తాకిడి

ప్రజాశక్తి-సీలేరు

వర్షాలు తగ్గ ముఖం పట్టడంతో సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జలాశయాలకు వరద తాకిడి తగ్గింది. దీంతో సోమవారం జలాశయాలు నుండి దిగు ప్రాంతాన్ని నీటి విడుదలను క్రమేపి తగ్గిస్తూ ఏపీ జెన్కో అధికారులు చర్యలు చేపట్టారు. డొంకరాయి జలాశయానికి వరదనీరు 1,10,000 క్యూసెక్కులు నుంచి 87000 క్యూసెక్కులకు తగ్గింది. దిగువ ప్రాంతానికి 1,10,000 నీటి విడుదలను కుదించి కేవలం 87 వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. దీని పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా ప్రస్తుతం 1029 అడుగులు నీటిమట్టాలు నిలకడగా ఉన్నాయి. సీలేరులోని గుంటవాడ జలాశయానికి పిల్లిగెడ్డ నుంచి ఇన్‌ఫ్లో 23 వేల క్యూసెక్కులు వరద నీరు చేరేది. మంగళవారం నాటికి కేవలం పిల్లి గెడ్డ నుంచి 8000 క్యూసెక్కుల వరద నీరు సీలేరు జలాశయంలో చేరుతుంది. ఇక్కడ గేట్లు ద్వారా నీటి విడుదలను మంగళవారం దశలవారీగా తగ్గిస్తూ మధ్యాహ్నం రెండు గంటల సమయానికి పూర్తిస్థాయిలో విడుదల చేశారు. గుంటవాడ జలాశయం నీటిమట్టం 1360 అడుగులు కాగా ప్రస్తుతం 1352 అడుగుల నీటిమట్టం నిలకడగా ఉంది.

జలాశయాలను పరిశీలించిన చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు దిగు సీలేరు డొంకరాయి, గుంటవాడ జలాశయాలు మంగళవారం పరిశీలించారు. జలాశయంలో నీటి నిల్వలు, వాగులు నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో వివరాలు జెన్కో ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. జలాశయాలు ప్రమాద స్థాయికి చేరుకోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. ఆయన వెంట సీలేరు కాంప్లెక్స్ ఎస్‌ఇ సివిల్ రామభద్రరాజు, ఈఈ గంట భాస్కరరావు, ఏడిఇ క్యాంపు వెంకట మధు, పంపు స్టోరేజ్ ఏడిఈ అప్పలనాయుడు, ఏఈ సురేష్ ఉన్నారు.


వరద తాకిడి తగ్గాక సీలేరు జలాశయం

చట్రాపల్లి మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లిలో ఆదివారం అర్ధరాత్రి కొండచరియలు విరిగిపడిన సంఘటనలో మృతి చెందిన కొర్ర కుమారి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొండచరియలు విరిగిపడి ఆ గ్రామస్తులు ఇళ్లతో పాటు సర్వం కోల్పోవడం దురదృష్టకరమన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఇల్లు కోల్పోయిన కుటుంబాలకు నూతనంగా ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. అలాగే మేకలు, పశువులు మృతి చెందాయని, వాటికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

భారీ వర్షాల వల్ల మండలంలోని 16 పంచాయతీల్లో వేలాది ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, పంటలకు నష్ట పరిహారం చెల్లించి తక్షణమే గిరిజన రైతులను ఆదుకోవాలని సత్యనారాయణ కోరారు. మండలంలోని దేవరపల్లి పంచాయతీలో దెబ్బతిన్న పంట పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ ఏడాది తుఫాన్ రైతులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యంత్రాంగం వెంటనే స్పందించి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మృతుని కుటుంబానికి పలువురు సహాయం

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన ఆవుల వెంకట్రామారావు (28) (ఎలక్ట్రీషియన్) ఆదివారం ఉదయం విద్యుత్ పని చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు జమాల్ ఖాన్ బియ్యం, నిత్యవసర వస్తువులు, రూ.6000 అందించారు. అలాగే మండలంలోని అల్లూరి సీతారామరాజు మేజిక్ యూనియన్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి సహాయంగా రూ.5000 అందించారు. ఈ కార్యక్రమంలో ఎడవల్లి భాస్కర్, సుఫీ, భరపాటి ప్రకాష్, జగిని విజయ్, కర్నాటి శ్రీను అప్పారావు, ఉమా, యూనియన్ ప్రెసిడెంట్ చిన్నా పాల్గొన్నారు.

లభ్యం కాని ట్రాక్టరు ఆచూకీ

ప్రజాశక్తి-సీలేరు : ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు అంతర్రాష్ట్ర రహదారి పిల్లిగెడ్డపై నూతన వంతెన నిర్మాణ పనులు చేస్తున్న జెసిబి, ట్రాక్టరు భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. మంగళవారం ఉదయం వాహనాల కోసం యజమానులు గాలింపు చర్యలు చేపట్టుగా పిల్లి గెడ్డ వాగు చెట్లు మధ్యలో చిక్కుకొని జెసిపి ఆచూకీ లభ్యమైంది. ట్రాక్టర్ ఆచూకీ తెలియరాలేదు.

రమాదేవికి సరోజా వైద్యనాథన్ పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ కూచిపూడి నర్తకీమణి, నాట్య పరిశోధకురాలు, ప్రయోక్త, రచయిత్రి డాక్టర్ పి.రమాదేవి డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ పురస్కారం - 2024కు ఎంపికయ్యారు. జాతీయ, అంతర్జాతీయ నృత్యోత్సవాల నిర్వహణలో పేరెన్నికగన్న నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యాన కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 27, 28, 29 తేదీలలో మూడు రోజులపాటు జరుగనున్న 16వ అఖిలభారత శాస్త్రీయ నృత్యోత్సవం 'వైశాఖీ నృత్యోత్సవ్' సన్నాహాలు ఇప్పటికే మొదలయ్యాయి. దేశ విదేశాలకు చెందిన మెరికల్లాంటి శాస్త్రీయ నృత్య కళాకారులతో మూడు రోజులపాటు రోజూ సాయంత్రం కోలాహలంగా నిర్వహించే ఈ ఉత్సవాల సందర్భంగా ఆయా కళాకారుల స్థాయి, నాట్య రంగంలో చేసిన కృషినిబట్టి నిపుణులకిచ్చే గౌరవ పురస్కారాల కోవలో ప్రతి ఏటా ఇచ్చే డాక్టర్ సరోజా వైద్యనాథన్ పేరిట నెలకొల్పిన ఎక్సలెన్స్ పురస్కారానికి రమాదేవిని తమ నిపుణుల కమిటీ ఎంపిక చేసినట్టు ఎఎండిఎ వ్యవస్థాపక అధ్యక్షులు, వైశాఖీ నృత్యోత్సవాల సంచాలకులు బత్తిన రంగ విక్రమ్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో వెల్లడించారు.



విరాళం అందిస్తున్న యువత

సిఎం సహాయ నిధికి రూ.5 వేలు వితరణ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం వేటుకూరు గ్రామానికి చెందిన గిరిజన యువత విజయవాడ వరద బాధితుల సహాయార్థం మంగళవారం ఎంపీడీవో ఎ.వీరకిషోర్‌కి రూ.5000 అందించారు. ఈ మేరకు ఎంపీడీవో గిరిజన యువతకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం సహాయనిధికి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందజేయాలని కోరారు.

ఆసుపత్రులకు గర్భిణుల తరలింపు

ప్రజాశక్తి- కూనవరం : గోదావరి వరదల నేపథ్యంలో నాలుగు మండలాలలో ఉన్న గర్భిణులకు ఆసుపత్రులకు తరలించి స్పెషలిస్టు వైద్యుల పర్యవేక్షణలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముందుగానే చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.పుల్లయ్య తెలిపారు. కూనవరం మండలం కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వరదల కారణం ముందుగా తరలించిన గర్భిణీలను ఆయన మంగళవారం కలిసి వారికి అందుతున్న వైద్య సేవలను, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు వరదల కారణంగా చింతూరు డివిజన్‌లో రాకపోకలు నిలిచిపోయాయని, ఈ సమయంలో ఆయా గ్రామాల్లో ఉన్న గర్భిణులకు ఎలాంటి వైద్య పరమైన ఇబ్బందులు ఉండకుండా ఉండేందుకు పలువురు గర్భిణీలను ఏరియా ఆసుపత్రి, కూనవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కోతులగుట్ట హాస్పిటల్‌కి తరలించామని తెలిపారు. వీరి ఆరోగ్య సమస్యలను గైనకాలజిస్టులు, స్పెషలిస్టు వైద్యులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు కూనవరం, చింతూరు ఆసుపత్రులకు 131మంది గర్భిణులను తరలించినట్లు తెలిపారు. వరదలు తగ్గి ఆయా గ్రామాలకు రాకపోకలు వచ్చే వరకు గర్భిణీలు ఆసుపత్రిలోనే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కూనవరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేశ్‌బాబు, గైనకాలజిస్టు డాక్టర్ పి.శ్వేత, డాక్టర్ బి.వివేక్ నాయక్, పిల్లల వైద్యులు డాక్టర్ ప్రజ్వల తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కోసం ఎదురు చూపులు

ప్రజాశక్తి -సీలేరు : రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కోసం జికె.వీధి మండలం గుమ్మల్ల గొంది గ్రామ గిరిజనులు మంగళవారం ఎదురు చూశారు. భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న పంటలను, కొండచరియలు విరిగిపడి ధ్వంసమైన చట్రాపల్లి గ్రామాన్ని సందర్శించడానికి మంత్రి సంధ్యారాణి మంగళవారం వస్తున్నారని చెప్పి అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో గుమ్మల గొంది గ్రామస్తులు ఉదయం 10 నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు మంత్రి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్, అధికారులు రాకపోవడంతో పడిగాపులు కాశారు. ఆయా గ్రామాలకు వెళ్ళడానికి రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయని తెలియడంతో పర్యటన రద్దు చేసుకున్నారు. దీంతో గుమ్మల్ల గొంది. గ్రామస్తులు నిరాశకు గురయ్యారు.

విఎంఆర్‌డిఎ అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఎంపీ ఎం.శ్రీభారత్ విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌తో కలిసి విఎంఆర్‌డిఎలో చేపట్టిన అభివృద్ధి పనులపై విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీభారత్ మాట్లాడుతూ విశాఖపట్నం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం కాబట్టి భవిష్యత్తు తరాలు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే చక్కటి ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని సూచించారు. దీనికి విఎంఆర్‌డిఎ కీలక భూమిక పోషించాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న బృహత్తర ప్రణాళికను ప్రజలు, ప్రజాప్రతినిధులు, ముఖ్యమైన వారితో చర్చించి సవరించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు.